క్లుప్తంగా

నేడు బీఆర్‌ఎస్‌ జెండావిష్కరణ

కొడంగల్‌: బీఆర్‌ఎస్‌ జెండావిష్కరణ కార్యక్రమాన్ని గురువారం ఉదయం 9గంటలకు పట్టణంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో నిర్వహించనున్నట్లు పార్టీ క్యాంప్‌ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్‌, కొడంగల్‌ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. అనంతరం రాఘవేంద్ర ఫంక్షన్‌ హాల్‌లో నియోజకవర్గ పరిధిలోని కొడంగల్‌, బొంరాస్‌పేట, దౌల్తాబాద్‌ మండలాల నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నారు.

సంతోష్‌కు ఘన సన్మానం


సంతోష్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

అనంతగిరి: వికారాబాద్‌ ప్రాంతానికి చెందిన జాతీయ యువజన కాంగ్రెస్‌ ప్రధాన కార్యదర్శి, ఛత్తీస్‌ఘడ్‌ యువజన కాంగ్రెస్‌ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి కోల్కుంద సంతోష్‌కుమార్‌ ఇటీవల రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌ జోడో యాత్రలో కన్యాకుమారి నుంచి కాశ్మీర్‌ వరకు రాహుల్‌గాంధీతో కలిసి నడిచారు. ఈ సందర్భంగా వికారాబాద్‌ విచ్చేసిన సంతోష్‌కుమార్‌కు బుధవారం కాంగ్రెస్‌ పార్టీ నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, యువజన నాయకులు శ్రీనివాస్‌ముదిరాజ్‌, నియోజకవర్గంలోని పలువురు నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రథమ ప్రాధాన్యత


నూతన చెత్త వాహనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్‌ సామ్యారెడ్డి, తదితరులు

కుల్కచర్ల: పారిశుద్ధ్య నిర్వహణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నట్లు కుల్కచర్ల సర్పంచ్‌ సామ్యారెడ్డి అన్నారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయానికి నూతనంగా చెత్త వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ మాట్లాడుతూ.. గ్రామ పరిధిలో ఎక్కడ కూడా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా గ్రామ పంచాయతీ వాహనాలకు తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హోమియో వైద్యురాలు మహేశ్వరి, వార్డు సభ్యులు మోత్కూరు వెంకటేశ్‌, కాటనిపల్లి మైపాల్‌, మెడికల్‌ అసిస్టెంట్‌ వెంకట్‌, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిర్లింగ పడిపూజ


పూజ చేస్తున్న భక్తులు

కొడంగల్‌: మండల పరిధిలోని హస్నాబాద్‌ గ్రామంలో ఎరుకల రమేశ్‌ గురుస్వామి ఇంట్లో శివస్వాములు జ్యోతిర్లింగ పడిపూజను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజకు హస్నాబాద్‌ గ్రామంతో పాటు పరిసర గ్రామాల స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మందిర ప్రారంభోత్సవానికి ఆహ్వానం

మర్పల్లి: మండల పరిధిలోని పట్లూర్‌ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి మందిరంలో గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని ఆ గ్రామ సర్పంచ్‌ దేవరదేశి ఇందిరఅశోక్‌ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, యువజన సంఘాల నాయకులకు ఆహ్వాన పత్రిక అందజేసినట్లు తెలిపారు. ఈ మేకు బుధవారం మండల పరిధిలోని ఘనాపూర్‌ గ్రామానికి చెందిన వీరశైవ లింగాయత్‌ సమాజం మండల అధ్యక్షుడైన వీర్‌శెట్టికి సైతం ఆహ్వానపత్రిక అందజేసినట్లు సర్పంచ్‌ తెలిపారు.

బంట్వారానికి రూ.42.50 లక్షల నిధులు మంజూరు

బంట్వారం: సీసీ రోడ్ల నిర్మాణం కోసం బంట్వారం గ్రామ పంచాయతీకి ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ నిధులు రూ.42.50 లక్షలు మంజూరైనట్లు స్థానిక సర్పంచ్‌ ఆలంపల్లి లావణ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆమె మంత్రి సబితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆనంద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పత్తి రైతుకు పరేషాన్‌

ప్రకృతి వైపరీత్యాలు ఎదురీగి ఆరుగాలం శ్రమించి పత్తి పండిస్తున్న రైతుకు పెట్టుబడి కూడా వచ్చేలా లేదు. పత్తి ధరలు పడిపోతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో క్వింటాలుకు రూ.7,500 వరకే చెల్లిస్తున్నారు. దీంతో తమకు గిట్టుబాటు కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఓ రైతు ఇంటిలో నిల్వ చేసిన పత్తి సంచులు

ఇళ్లల్లోనే నిల్వలు
- క్రమంగా పడిపోతున్న ధర
- ఆందోళన చెందుతున్న రైతులు

దౌల్తాబాద్‌: పత్తి పంట రైతులకు కన్నీళ్లు మిగులుస్తోంది. తగ్గుతున్న ధర రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇంటిలో నిల్వ ఉంచిన పత్తి పంట అలాగే ఉండగా ధర పాతాళానికి చేరుతోంది. ప్రధానంగా రైతులు వరి, పత్తి పంటలను సాగుచేస్తున్నా రు. కొన్నేళ్లుగా పత్తి పంట ఎక్కువగా సాగు చేస్తున్నారు.

తగ్గుతున్న ధర

పత్తి పంటకు ఆరంభంలో మంచి ధర వచ్చింది. గత నవంబర్‌లో పత్తి క్వింటాల్‌కు రూ.9,400 మద్దతు ధర ప్రకటించారు. డిసెంబరు వరకు కొనసాగిన ఆ ధర అనంతరం క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఈ క్రమంలో ప్రస్తుతం పత్తి ధర క్వింటాల్‌కు రూ.7,800 పలుకుతోంది. సీటూరు సమీపాన ఉన్న మిల్లులో పత్తి క్వింటాల్‌కు రూ.7,800 ఉండగా క్వింటాల్‌కు రూ.150 వరకు హమాలీ, కిరాయి తదితర ఖర్చులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. పత్తి నాణ్యతను అనుసరించి ధరల్లో మార్పులు ఉంటాయని మిల్లు యజమానులు వెల్లడిస్తున్నారు.

అంతర్జాతీయ మార్కెట్‌ ప్రభావం

అంతర్జాతీయంగా మార్కెట్లోని పరిస్థితుల ప్రభావం పత్తి ధరలపై చూపుతోందని వ్యాపారులు పేర్కొంటున్నారు. గతేడాది పత్తి నిల్వలు ఎక్కువగా ఉండడంతో మిల్లుల నుంచి ఎగుమతులు మందగించాయని ఈ క్రమంలో దేశీయ ధరలు తగ్గుతున్నాయని వ్యాపారవర్గాలు వెల్లడిస్తున్నాయి. గతేడాది దిగుబడుల కన్నా తక్కువ దిగుబడి ఉన్నా ధరలు పడిపోతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిల్వ ఉంచిన పత్తికి నష్టమేనా.?

పత్తి ధరలు పెరుగుతాయనే ఆశతో రైతులు పత్తి పంటను ఇంటిలోనే నిల్వ ఉంచుతున్నారు. గత నవంబర్‌లో ప్రకటించిన ధర వస్తుందనే ఆశతో అన్నదాతలు పత్తి మార్కెట్‌కు తీసుకెళ్లడం లేదు. ధర క్రమంగా తగ్గుతుండడంతో నిల్వ ఉంచిన పత్తి నష్టానికే అమ్ముకోవాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



పత్తి ధరలు పడిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. పెట్టుబడి వచ్చే పరిస్థితి కూడా లేదు. ప్రభుత్వం మద్దతు ధర రూ.10వేలకు పెంచాలి. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– శివారెడ్డి, రైతు, దౌల్తాబాద్‌

గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతే లక్ష్యం

ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అల్లాపూర్‌ గ్రామ పంచాయతీ పరిధిలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేయడంతో పాటుగా 10 లక్షల రూపాయల సీసీరోడ్డు నిర్మాణ పనులు, రూ. 25 లక్షలతో మనఊరు మనబడి కార్యక్రమం పనులకు పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో అన్నివిధాలుగా సౌకర్యాలు కల్పించాలన్న ఉద్దేశంతో గ్రామస్తులకు అవసరమైన అభివృద్ధి పనులు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లోని విద్యార్థులకు సౌకర్యవంతమైన పాఠశాలలలో నాణ్యమైన విద్యను అందించేందుకు మనఊరు మనబడి కార్యక్రమం ద్వారా ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందినప్పుడే వ్యవస్థ వృద్ధిని సాధిస్తుందని చెప్పారు. ముఖ్యంగా గిరిజన ఆవాసాలు అభివృద్ధి వెలుగులతో మెరవాలన్న సంకల్పంతో ప్రణాళికాయుతంగా అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, స్థానిక సర్పంచ్‌ శివిబాయినాలునాయక్‌, రైతుబంధు మండల అధ్యక్షులు రాజు, బీఆర్‌ఎస్‌ పార్టీ కుల్కచర్ల మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, ఎంపీడీఓ నాగవేణి, ఎంపీఓ కరీం, ఎంఈఓ హబీబ్‌ అహ్మద్‌, సీఆర్పీ రాజు, నాయకులు జోగు వెంకటయ్య, కొండయ్య, మాలె కృష్ణయ్య, మొగులయ్య, బాల్‌రెడ్డి, పెంటయ్య, మోతిలాల్‌ తదితరులు పాల్గొన్నారు.


గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, స్థానిక నేతలు

అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలి


కలెక్టర్‌ నిఖిలకు పుష్పగుచ్ఛం ఇస్తున్న జిల్లా అధికారులు, తదితరులు

- కలెక్టర్‌ నిఖిల
- బదిలీపై వెళ్లడంతో ఘనంగా వీడ్కోలు పలికిన అధికారులు, ప్రజాప్రతినిధులు

అనంతగిరి: జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్‌ నిఖిల అధికారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్‌ నిఖిల బదిలీపై వెళ్తున్న సందర్భంగా జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ జిల్లాలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సహకరించిన జిల్లా యంత్రాంగం, వివిధ శాఖల అధికారుల, సిబ్బంది సహకారం మరువలేనిదన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమాలను చేపట్టడంలో సంతృప్తిని కలిగించిందన్నారు. జిల్లాలో క్రీడా మైదానాలు, పల్లె ప్రకృతి వనాల ఏర్పాట్లలో జిల్లా ముందంజలో ఉండటం అధికారుల కృషి ఫలితమేనన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమాన్ని విజయవంతంగా చేస్తున్నటువంటి విద్యాశాఖ సిబ్బంది, వివిధ ఇంజనీర్‌ విభాగాల అధికారుల కృషి ఎంతో ఉందని కొనియాడారు. కలెక్టరేట్‌ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం పర్యటనకు విచ్చేసిన సందర్భంగా పదిరోజుల పాటు కష్టపడి పనిచేసిన అధికారులను కలెక్టర్‌ అభినందించారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్న వైద్య శాఖ సిబ్బందిని కలెక్టర్‌ ప్రశంసించారు. వీడ్కోలు సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్‌ రాహుల్‌ శర్మ, డీఆర్‌ఓ అశోక్‌కుమార్‌, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్డీఓ కృష్ణన్‌, డీటీడబ్ల్యూఓ కోటాజీ, డీపీఓ తరుణ్‌కుమార్‌, ఆర్డీఓ విజయకుమారి, డీఈఓ రేణుకాదేవి, డీఎంహెచ్‌ఓ పాల్వాన్‌ కుమార్‌, పశువైద్యాధికారి అనిల్‌కుమార్‌, డీఎస్‌డీఓ మల్లేశం, ఎస్సీ కార్పొరేషన్‌ ఈడీ బాబు మోజెస్‌, డీఏఓ గోపాల్‌, డీసీఎస్‌ఓ రాజేశ్వర్‌, డీహెచ్‌ఎస్‌ఓ చక్రపాణి, పౌర సరఫరాల జిల్లా మేనేజర్‌ విమల, డీపీఆర్‌ఓ ఆరీఫుద్దీన్‌, ఎంపీడీఓల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్తయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించండి

కొడంగల్‌: ప్రాథమిక సహకార సంఘంలో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని పీఏసీఎస్‌ చైర్మన్‌ శివకుమార్‌ గుప్తా కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పీఏసీఎస్‌ ద్వారా రైతులకు పలు రకాల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ రుణాలు, పంట రుణాలు, స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. మార్చిలోపు పంట రుణాలను రెన్యువల్‌ చేయించుకోవాలన్నారు. మార్చిలోపు రెన్యువల్‌ చేయించుకుంటే 7 శాతం వడ్డీ పడుతుందన్నారు. సకాలంలో రుణాలు చెల్లించని వారికి 13 శాతం వడ్డీ పడుతుందన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

సర్పంచ్‌ రఫీ

నవాబుపేట: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎక్‌మామిడి సర్పంచ్‌ ఎండీ.రఫీ అన్నారు. మండల పరిధిలోని ఎక్‌మామిడి గ్రామంలో బుధవారం మాలమాడ గ్రామానికి చెందిన జేబీఆర్‌ బాల్‌రాజ్‌ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్‌ టోర్నమెంట్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ మాట్లాడుతూ.. యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై దృష్టి సారించాలన్నారు. మండల స్థాయి క్రికెట్‌ టోర్నమెంట్‌ నిర్వహించి యువతను ప్రోత్సహిస్తున్న జేబీఆర్‌ బాల్‌రాజ్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎక్‌ మామిడి, మూలమాడ గ్రామాల ఉప సర్పంచ్‌లు కృష్ణ, శ్రీనివాస్‌యాదవ్‌, నాయకులు వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కృష్ణ, నగేశ్‌, శ్రీనివాస్‌, సాయికుమార్‌, వినోద్‌ కుమార్‌, నాగేశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్‌

ధారూరు: మండల పరిధిలోని ధర్మాపూర్‌ గ్రామంలో బుధవారం సర్పంచ్‌ బోడ అనిల్‌కుమార్‌ సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. రూ. 7.50 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్లు సర్పంచ్‌ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ శాంతమ్మ, వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు పెరుగుతాయి

పెద్దేముల్‌: క్రీడలతో స్నేహ సంబంధాలు పెరుగుతాయని పెద్దేముల్‌ జెడ్పీటీసీ ధారాసింగ్‌ తనయుడు జాదవ్‌ సునీల్‌ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెద్దేముల్‌తండాలో శ్రీసంత్‌ సేవాలాల్‌ మహరాజ్‌ జయంతిని పురస్కరించుకొని బంజార యువకులకు క్రికెట్‌ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో మొత్తం 37 టీంలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రీడలతో మంచి స్నేహ సంబంధాలు ఏర్పడటంతో పాటు మానసికోల్లాసం, శారీరక దారుఢ్యం పెంపొందుతాయన్నారు. గ్రామీణ క్రీడాకారులను వెలికి తీసేందుకు ఈ క్రీడలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.40 వేలు, రెండవ బహుమతి రూ.20 వేలతో పాటు ట్రోఫీలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు సురేశ్‌, సంతోష్‌, రాహుల్‌, ధన్‌రాజ్‌, గణేశ్‌, శ్రీను, నరేశ్‌, ప్రవీణ్‌తో పాటు వార్డు సభ్యులు లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.


పెద్దేముల్‌ తండాలో క్రికెట్‌ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న యువకులు

క్రీడలపై దృష్టి సారించాలి

మర్పల్లి: ప్రతి యువకుడు చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలని కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పరి రవీందర్‌ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొంషేట్‌పల్లి గ్రామంలో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్‌ సతీమణి గడ్డం శైలజ జ్ఞాపకార్థం కొంషేట్‌పల్లిలో గ్రామ స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ నిర్వహించారు. ఈ పోటీలను ఆ గ్రామ సర్పంచ్‌ ఫర్వీనాబేగం రఫియొద్దీన్‌, కాంగ్రెస్‌ పార్టీ మైనార్టీ సెల్‌ జిల్లా మాజీ అధ్యక్షుడు ఖలీమోద్దీన్‌తో కలిసి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎండీ సలీం, మండల వర్కింగ్‌ ప్రెసిడెంట్లు ఐనెల్లి రాచన్న, రఫియొద్దీన్‌, బీసీ సెల్‌ మండల అధ్యక్షుడు సర్వేశం, ఎస్సీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు దేవరాజ్‌, ఎస్సీ సెల్‌ మండల అధ్యక్షుడు శేఖర్‌, మైనార్టీ సెల్‌ జిల్లా నాయకుడు తాజొద్దీన్‌, యూత్‌ కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు సాయిపటేల్‌, కోట్‌మర్పల్లి కాంగ్రెస్‌ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కబడ్డీ టోర్నమెంట్‌ నిర్వాహకులు శ్రీనివాస్‌, షాబొద్దీన్‌, ఎండీ ఫారూక్‌, బుదేర భాస్కర్‌, మొగిలిగుండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట: ఎమ్మెల్యే

దౌల్తాబాద్‌: తెలంగాణ ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నర్సాపూర్‌ గ్రామంలో సుమారు రూ.10లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని, అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్‌ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవీ, ఎంపీపీ విజయ్‌ కుమార్‌, జెడ్పీటీసీ సభ్యుడు మహిపాల్‌, వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్‌ హేమలతనర్సింహ తదితరులు పాల్గొన్నారు.


నర్సాపూర్‌ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పేద ప్రజలను ఆదుకుంటాం

డీసీసీబీ చైర్మన్‌ మనోహర్‌రెడ్డి

దోమ: గ్రామాలలోని పేద ప్రజలను ఎల్లప్పుడూ ఆదుకుంటామని డీసీసీబీ చైర్మన్‌ మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎండీ గౌస్‌ అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ మేరకు విషయం తెలుసుకున్న మనోహర్‌రెడ్డి బుధవారం వారి నివాసానికి చేరుకొని బాధితుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం విషయంలో ఎలాంటి సహాయం కావాలన్నా తనను సంప్రదించాలని కోరారు. మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌ బంగ్ల యాదయ్య గౌడ్‌, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాంలాల్‌నాయక్‌, నాయకులు బంగ్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.


బాధితుడిని పరామర్శిస్తున్న డీసీసీబీ చైర్మన్‌ మనోహర్‌రెడ్డి

శివస్వాములను దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

దోమ: శివస్వాములను దూషించిన వ్యక్తిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని మండల శివస్వాములు డిమాండ్‌ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌ స్టేషన్‌లో ఎస్‌ విశ్వజాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలోని యాలాల మండల పరిధి లక్ష్మీనారాయణపూర్‌ చౌరస్తాలో నరేందర్‌ అనే శివ స్వామిని దేవనూర్‌కు చెందిన మేట్ల నరేశ్‌ అనే వ్యక్తి అనుచితంగా ప్రవర్తించి దూషించాడన్నారు. ఆ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఎస్‌ఐని కోరారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం


యాలాల: అచ్యుతాపూర్‌లో కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్‌, ఎంపీటీసీ

సర్పంచ్‌ మధుసూదన్‌రెడ్డి

యాలాల: ఆరోగ్యవంతమైన సమాజమే తెలంగాణ రాష్ట్ర లక్ష్యమని అచ్యుతాపూర్‌ సర్పంచ్‌ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని పగిడియాల ఎంపీటీసీ రాములుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో పాటు ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం ఎంతో కట్టుబడి ఉందన్నారు. అంధరహిత రాష్ట్ర సాధన కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా కంటి పరీక్షలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సహకారంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా అవసరమైన వారికి కళ్లద్దాలు, మందులను వైద్య సిబ్బందితో కలిసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

పరిగి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్‌ చైర్మన్‌ ముకుందఅశోక్‌కుమార్‌ సూచించారు. పట్టణ కేంద్రంలోని 3వ వార్డులో బుధవారం రెండో విడత కంటి వెలుగు పథక కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కంటి వెలుగు పథకం ఎంతోమంది కుటుంబాల్లో వెలుగులు నింపుతుందన్నారు. సీఎం కేసీఆర్‌ ప్రజా సంక్షేమం కోసమే పనిచేస్తున్నారని అన్నారు. ప్రతిఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ శ్రీనివాసన్‌, కౌన్సిలర్లు కిరణ్‌, రవీందర్‌, కృష్ణ, మునీర్‌, నాయకులు ప్రవీణ్‌, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

19వ వార్డులో ప్రారంభించిన వైస్‌ చైర్‌పర్సన్‌

తాండూరు: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తాండూరు మున్సిపల్‌ వైస్‌ చైర్‌పర్సన్‌ పట్లోళ్ల దీప అన్నారు. బుధవారం తాండూరు పట్టణంలోని 19వ వార్డులోని శిశు మందిర్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని వైస్‌ చైర్‌పర్సన్‌ కౌన్సిలర్లు ముక్తార్‌నాజ్‌, ఆసిఫ్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్నారు.

బడేమో ఇలా.. బోధన సాగేదెలా?

మండలంలో పలు సర్కారు బడులు శిథిలావస్థకు చేరాయి. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని పాలకులకు, అధికారులకు ఫిర్యాదులు చేసినా లాభం లేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో వసతులు లేక కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్నాయి.

- శిథిలావస్థలో ప్రభుత్వ బడులు
- అధ్వానంగా తరగతి గదులు
- ఆరుబయట, వరండాల్లోనే బోధన
- భయాందోళనకు గురవుతున్న విద్యార్థులు


మదనంతపూర్‌లో శిథిలావస్థకు చేరిన పాఠశాల గదులు

పెద్దేముల్‌: మండలంలో 45 ప్రాథమిక, 9 ఉన్నత, 5 ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. ప్రైమరీ–2872, యూపీఎస్‌–1399, ఉన్నత–1065తో కలుపుకొని మొత్తం 5336 మంది విద్యార్థులు విద్యాబోధన చేస్తున్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాల గదులు అధ్వానంగా మారాయి. దీంతో ఉపాధ్యాయులు వరండాల్లో, ఆరుబయట బోధన చేస్తున్నారు. మదనంతపూర్‌లో నాలుగు గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో అక్కడ ఉపాధ్యాయులు కమ్యూనిటీ హాల్‌లో బోధన కొనసాగిస్తున్నారు. ఇందూరు ప్రాథమిక పాఠశాలలో మూడు గదులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. పాఠశాల పైకప్పుపై చెట్టు పెరిగి అడవిగా మారడంతో పాటు గోడలు బీటలు వారి ప్రమాదంగా మారాయి. ఈ విషయాన్ని అధికారులెవరూ పట్టించుకోవడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు వాపోతున్నారు. చినుకు పడితే నీరు గదుల్లోకి వస్తుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంఘమేశ్వర్‌ తెలిపారు.

గిర్మాపూర్‌ పాఠశాలలో..

గిర్మాపూర్‌ పాఠశాల పేరుకు 5వ తరగతి వరకు ఉన్నా ప్రస్తుతం ఒకే గదిలో ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. చినుకు పడితే పాఠశాలకు సెలవు తప్ప మరో మార్గం లేదని గ్రామ ప్రజలు అంటున్నారు. ఈ విషయాన్ని మండల సర్వసభ్య సమావేశంలో ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదన్న ఆరోపణలు వినబడుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రైవేట్‌ పాఠశాలలకు దీటుగా అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పడం తప్ప ఎలాంటి సమస్యలు తీరడం లేదని అంటున్నారు. మన ఊరు– మన బడి కార్యక్రమం క్రింద ప్రభుత్వం సుమారు 20 వరకు పాఠశాలలను ఎంపిక చేసినా.. ఏ పాఠశాలల్లో కూడా పూర్తి స్థాయిలో సమస్యలు పరిష్కారం కావడంలేదు. ఇప్పటికైనా ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్‌ సునీతారెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలు స్పందించి కొత్త భవనాలను మంజూరు చేయాలని పలు గ్రామాల పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్‌లు, గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దానికి తోడు వంట గదులు లేక వంట ఆయాలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై మండల విద్యాధికారి వెంకటయ్యను వివరణ కోరగా కొత్త భవనాలకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.